

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - పదమూడవ కథ -

**ప్రియమైన పాఠకులకు,**

*బాగున్నారా?*

*విరామం తీసుకున్నందుకు క్షమించండి.*

*ఈ నెల కథ గురించి.*

*ఎప్పుడూ రోగాలు, అవస్థలేనా, ఏదైనా మామూలు కథ, పోనీ ప్రేమ కథ రాయరాదూ అని ఒక ఫ్రెండ్ సూచిస్తే, స్వాతంత్ర్యం తీసుకుని మీ అందరికీ కొంచం మార్పుగా ఉండాలన్న ఉద్దేశంతో వ్రాశాను.*

**మీ**

**చందు శైలజ**

డా. గౌతమి ఒకప్పుడు చిన్న గౌతమిగా స్కూలుకెళ్ళే రోజుల్లో...

రెండోక్లాసులోపలికి వెళ్ళాలంటే ఒకటో క్లాసు గదిని దాటుకుని వెళ్ళాలి. ఒకటో క్లాసు పంతులుగారు రోజూ ఆ పిల్లను గమనిస్తూనే ఉండేవాడు. “ఈ పిల్ల బూరి బుగ్గలు బిగించుకునే వెళ్తుందే, ఆ బుంగమూతి లో ఎప్పుడూ నవ్వు చూడలేదే?” అనుకునే వాడు.

ఓ రోజు బుగ్గ గిల్లి “నీ పేరేంటి పాపా?” అని అడిగాడు.

మాస్టారి వంక చూసింది కానీ, సమాధానం చెప్పలేదు.

“దానికి బలే పొగరు మాష్టారూ, ఎవరితోనూ పలకదు.” అంటూ ఓ పిల్లాడు చెప్పాడు.

“ఆహా..”

'మాటల్లో మొండి'

'ఆటల్లో తొండి'

మొత్తమ్మీద 'ఉట్టి జగమొండి!' పిల్లలంతా కలిసి ఆ పిల్లమీద ఒక నివేదిక సమర్పించారు మాష్టారికి.

తర్వాతిరోజు బ్లూ గౌన్ వేసుకుని, ఒక సంచీ పట్టుకుని మళ్ళీ ఒకటో క్లాసు ముందు నడుస్తూ వెళ్తోంది. కాలికి పట్టీలున్నాయికానీ, మువ్వలు లేని పట్టీలు. మోగడం లేదు. నిశ్శబ్దంగా వెళ్తుంటే మాస్టారు ఆపాడు. మళ్ళీ పలకరించాడు. "పాపా నీ పేరేంటి?" అని బుగ్గ పట్టుకున్నాడు.

“గౌతమి" అని చెప్పింది.

బిగించిన పెదవులు. బూరిబుగ్గలు.

"నువ్వు నవ్వవెందుకమ్మా?" అడిగాడు.

మాస్టారి వంక చూడకుండా వెళ్ళిపోయింది.

మూడో రోజు ఎరుపు రంగు గౌనువేసుకుంది. రెండు చిట్టి చిట్టి పిలకలు వేసుకుంది. మరీ అంత, అంతులేకుండా ముద్దొస్తుంటే, మాస్టారు ఆపేశాడు.

ఈ పిల్లమొహంలో అంత కోపమేంటి? ఈ వయసులోనే అంత గంభీరంగా ఉంటుందెందుకని?

“పాపా, ఇలారా.”

“నే ఎల్తా! ”

“ఎందుకంత కోపంగ ఉంటావు. ఇవాళ తేలాల్సిందే” అంటూ పాపను పట్టుకుని వళ్ళో కూర్చోబెట్టుకోబోయాడు. ఆయన్నుండి ఎలా తప్పించుకోవాలో తెలియక, చేతిలో పలక తో విసిరికొట్టింది. పలక అంచున లేచి ఉన్న రేకు వల్ల ఆయనకు నుదిటిమీద గీసుకుపోయింది. క్షణాల్లో స్కూలంతా వార్త పాకిపోయింది. గౌతమి మాస్టార్ని కొట్టిందని.

గౌతమి హైస్కూల్లో చేరిన తర్వాత వేసవి సెలవల్లో వాళ్ళ ఊరువెళ్ళేది. మేనత్త పిల్లలు, పెదనాన్న పిల్లలు అందరూ కలిసి ఆడుకునే వాళ్ళు. ఎక్కువమంది మగపిల్లలు.

ఓ రోజు, ఆమె ఒక్కతే అరుగుమీద కూర్చుని మిగతా వాళ్ళు ఆడుతున్న కబాడీ ఆట చూస్తోంది.

మేనత్త కొడుకు వచ్చాడు. ఆమెకన్నా ఒక సంవత్సరం పెద్ద. ఆమె కూర్చున్న చోట అరుగుకు ఆనుకుని నుంచున్నాడు. ఆటకు అడ్డువస్తున్నాడని, "ఒరే శీనూ, అడ్డం లే" అంది.

"ఒరే అంటావే? బావా అను "

"ఏంట్రా, నిన్నేమని పిలవాలీ?” కోపంతో అడిగింది.

"ఒరే అంటావే? బావా అని పిలవాలి నువ్వు, తెలుసా?" అన్నాడు .

వాడన్న మాటకన్నా, వాడిగొంతులో వినిపించిన అధికారం, పొగరు ఆమె తట్టుకోలేకపోయింది. అతన్ని బలంగా ఒక్క తోపు తోసింది. కబాడీ ఆడుకుంటున్న వాళ్ళ మధ్యలో బోర్లా పడ్డాడు. మొహానికి, బట్టలకూ మట్టి అంటుకుంది.

పిల్లలంతా నవ్వారు. అందరిలోనూ పెద్దవాడైన కజిన్ వాణ్ణి లేవదీశాడు.

వాడు పొంగి వస్తున్న ఏడుపాపుకుని " ఉండు మా అమ్మతో చెప్తా " అంటూ వెళ్లాడు.

శీను వాళ్ళ తల్లి మట్టితో నిండిన బట్టలు మార్చకుండా వాణ్ణి తీసుకొచ్చి, గౌతమి తప్పు నిరూపించడానికి వచ్చింది.

"ఆ పిల్లకు అంత పొగరేంటీ, మావాడసలేమన్నాడని? బావని బావా అని పిలవంటేనే తోసేస్తుందా?"

"అలా వరసలు కలపడం అంత మంచిది కాదులేమ్మా" గౌతమి తండ్రి నచ్చచెప్పబోయాడు.

"ఆడపిల్లని ఇలా పెంచడం అంత మంచిదికాదు..." అని ఏదో చెప్పబోయింది ఆవిడ.

"ఆ తేడా మాకు తెలియదు, మీరేమనుకోవద్దు." సంభాషణ తుంచేశాడు తండ్రి.

గౌతమి పొగరు బోతు, మొండి ఘటం, గర్విష్టి, జగమొండి ఇలా కాలేజీలో ఎన్నో బిరుదులు సంపాదించుకుంది.

మెడికల్ కాలేజీలో చేరబోయే ముందు ఆమె తల్లితండ్రులు అందరితోనూ కలిసిపోవాలనీ, మగవాళ్ళతో కూడా మామూలుగానే మాట్లాడాలని చెప్పారు. ఆడపిల్లలతో సఖ్యంగా ఉన్నట్టే మగవాళ్ళతో కూడా మాట్లాడడానికి ప్రయత్నించింది. కాకపోతే, ఆమె చదివిన స్కూల్లో చాలా మంది పిల్లలకు ఆమెతో పాటే సీటు రావడంతో, అప్పటివరకూ ఆమె సంపాదించుకున్న బిరుదులు మెడికల్ కాలేజీకు కూడా బదిలీ అయ్యాయి. ఆమె గురించిన సంగతులు మరింత రంగు పులుముకుని ప్రచారం లోకి వచ్చాయి.

'అదేపనిగా చూస్తున్నాడని ఓ మాస్టార్ని కొట్టినంత పనిచేసింది.'

'వెంటబడుతున్నాడని చలపతిని చెప్పుతో కొట్టింది.'

'ఇంటి చుట్టూ తిరుగుతున్నాడని మహేష్ ని చెంపపగలగొట్టింది.'

'ట్యూషన్ మాస్టారు వేషాలెయ్యబోతే ఆయన భార్యతో చెప్పి పరువుతీసింది.'

తోటి మగపిల్లలతో ఆమె మాట్లాడబోయినా , ఆమెతో ఎందుకొచ్చిన గొడవ అని వాళ్ళే దూరంగా ఉండేవారు. ఎంత ప్రయత్నించినా సరే, మగపిల్లలతో మాట్లాడడం ఆమెకు సాధ్యం కాలేదు. తర్వాత ఆ ప్రయత్నాలు మానుకుని చదువు మీద శ్రద్ధ చూపించింది. ఆమె ఆత్మవిశ్వాసానికి విజయాలు తోడయ్యాయి. విజయం తో స్నేహం తర్వాత, ఆమెకు స్నేహితులు తక్కువయ్యారు.

ఎంబిబిఎస్ అయిపోయాక పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యడానికి పెట్టిన ఎంట్రన్స్ పరీక్షలో ఆమెకు పదో రాంక్ వచ్చింది. తను ఏ బ్రాంచ్ లో చేరాలనుకుంటోందో ముందే నిర్ణయించుకుంది. ఆ రోజుల్లో, ఆ బ్రాంచ్ ఎక్కువగా మగపిల్లలే తీసుకునేవారు. అప్పట్లో అది ఆడవాళ్ళకు నిషేధం అన్నట్లు ఉండేది పరిస్థితి.

ఆమె పేరు, నంబర్ పిలవగానే లోపలికి వెళ్ళి కౌన్సెలింగ్ చేసే టేబిల్ ముందు కూర్చుంది. టేబిల్ వద్ద ముగ్గురు మెంబర్స్ కూర్చున్నారు. ఇద్దరు మగవాళ్ళు, ఒక లేడీ ప్రొఫెసర్

తను ఎందులో చేరాలనుకుంటుందో చెప్పగానే ముగ్గురూ ఆశ్చర్యపడి రెండు క్షణాలు ఏమీ మాట్లాడలేకపోయారు.

"అది మగవాళ్ళ బ్రాంచ్ అమ్మా, నీకెందుకు? గైనిక్ తీసుకోరాదూ?"

"చదువుకు జెండర్ ఏంటి సార్? నాకదే కావాలి."

"నీకో పది నిముషాల టైం ఇస్తాము. కొద్దిగా ఆలోచించుకుని చెప్పమ్మా!"

"అక్కర్లేదండీ."

"మా కోసం" అంటూ, ఆలోచించి చెప్పమని బలవంతాన ఆమెను పక్కన కూర్చోబెట్టారు.

ఆమె కిటికీ లోనుండి కనిపించే కొండలవంక చూస్తూ ఉంది.

ఎవరో వచ్చి తనపక్కనే కూర్చున్నారన్న విషయం కూడా గమనించుకోలేదు.

"కంగ్రాట్స్ అమ్మా" గొంతు వినబడితే పక్కకు తిరిగి చూసింది.

సర్జరీ ప్రొఫెసర్ రామానుజం ఆమె పక్కనే నిలబడి ఉన్నాడు.

వెంటనే లేచి నిలబడింది.

"థాంక్యూ సార్, చూసుకోలేదు."

"పర్లేదు కూర్చోమ్మా." అంటూ ఆమెను కూర్చోబెట్టి ,ఆయనకూడా పక్కనే కుర్చున్నాడు.

"మా చందూ తెలుసుగా...."

డా. రామచంద్ర వాళ్ళబ్బాయని కాలేజీలో అందరికీ తెలుసు. ఆమెకు ఒక సంవత్సరం సీనియర్.

"తెలుసు సార్."

"వాడు నీ రేంక్ తర్వాత ఉన్నాడు. మావాడు నువ్వు తీసుకోవాలన్న బ్రాంచ్ కోసం రాత్రింబవళ్ళు కష్టపడ్డాడు. చివరి నిముషంలో నువ్వొస్తావని, ఆ సీట్ పోతుందని మేమూహించలేదు. నువ్వుకొద్దిగా అడ్జస్ట్ అయితే బాగుంటుంది." అని ఒక నిముషం తర్వాత "నువ్వు గైనిక్ తీసుకోమ్మా." అన్నాడు

"నేను కూడా ఆ బ్రాంచ్ కోసమే చదివాను సార్."

" ఆడపిల్లలు ఏ బ్రాంచ్ తీసుకున్నా చివరకు గైనిక్ ప్రాక్టీసే చెయ్యాల్సి ఉంటుంది. మనవూళ్ళో లేడీ డాక్టర్స్ ఎంతోమంది వేరే బ్రాంచ్ లో చేరి ఇప్పుడు గైనిక్ ప్రాక్టీస్ చేస్తున్నారు. నీకు తెలుసుకదా."

ఎంత చెప్పినా ఆమె ఒప్పుకోలేదు.

"మీ ఫాదర్ ని కలుస్తానమ్మా" అన్నాడు

"ఆయన నా నిర్ణయాన్ని మార్చుకోమని ఎప్పుడూ చెప్పరు"

అయినా సరే కలుస్తానంటే తండ్రి ఎక్కడున్నాడో కళ్ళతో వెతికి చూపించింది.

కాసేపటికి తండ్రి వచ్చాడు. ఆయన మొహంలో ఏదో తెలియని మొహమాటం, బెరుకు చూసింది. తండ్రిని అలా ఎప్పుడూ చూడలేదు.

ఆయన మాట్లాడడానికి వెనకాడుతుంటే ఆమే అడిగింది.

"ఏం నాన్నా?"

"అమ్మా, సీట్ వచ్చిన తర్వాత పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చావు కదా. నువ్వు చాలా అదృష్టవంతురాలివి."

"అవునూ, అయితే?"

మంచి సంబంధం అంటూ ప్రొఫెసర్ రామానుజంగారు వాళ్ళ అబ్బాయికి పైసా కట్నం లేకుండా చేసుకోవాలనుకుంటున్నాడనీ, పెళ్ళి అయిన తర్వాత ఇద్దరూ నర్సింగ్ హోం కూడా తనే కట్టిస్తాడనీ, చెప్పాడు.

"ఒక్క సారి ఆలోచించు. అబ్బాయిని కూడా చూశాను. ఇంత మంచి సంబంధం నేను తీసుకురాగలనా? నువ్వు గైనిక్ తీసుకుంటే బాగుంటుందమ్మా"

తండ్రితో ఇలా మాట్లాడిస్తున్నారంటే వాళ్ళమీద అసహ్యం వేసింది. తండ్రిని చూస్తే జాలేసింది. 'సీటు కోసం ఇన్ని వేషాలా ?' లోపల్నుంచి కోపం తన్నుకొచ్చింది.

'అప్పటకప్పుడు రెడీమేడ్ పెళ్ళికి కూడా సిద్ధపడతారా? ఏం మనుషులు? ఛీ!'

ఏమ్మాట్లాడకుండా మౌనంగా కూర్చుంది.

"ఏమ్మా, ఏం చెప్పమంటావు ఆయనకు ?"

" ఆయన్ని ఒక మారేజ్ బ్యూరో పెట్టుకోమను నాన్నా. నే వెళ్తున్నా." అంటూ కౌన్సెలింగ్ టేబుల్ దగ్గరకెళ్ళింది.

"మీరు చెప్పిన అరగంట అయిపోయింది సార్."

"ఏమ్మా, నీ డెసిషన్ మార్చుకున్నావా?"

"మార్చుకునేవాటిని నిర్ణయాలనరు సార్"

సీట్ తీసుకున్నతర్వాత అందరూ ఆమెను విచిత్రంగా చూస్తూ ఉండగా బయటకు వచ్చింది.

డా. రామచంద్ర ఒక స్తంభానికి ఆనుకుని ఉన్నాడు.

పక్కనే ఎవరో స్నేహితులు ఉన్నారు.

"ఒక మాట!" అతన్ని పలకరించింది.

అతను పక్కకొచ్చాడు.

"సీటు రావాలంటే చెయ్యాల్సింది హార్డ్ వర్క్ , బేరాలు కాదు. వేరే వాళ్ల సీట్ మీకిమ్మని అడగడానికి సిగ్గుగా లేదూ?"

ఊహించని దాడికి అతను మొదట ఆశ్చర్యపోయాడు. అందరిముందూ ఆమె మాటలకు అవమానపడి నుంచున్నాడు. మొహం పాలిపోయింది. కళ్ళు ఎరుపెక్కాయి కానీ ఆమెనేమీ అనలేదు.

ఆమె వెళ్ళిపోయాక స్నేహితులడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక అక్కడినుండి వెళ్ళిపోయాడు. తండ్రి కౌన్సెలింగ్ సెంటర్ కు రమ్మనమని ఎంత బతిమలాడినా రాలేదు.

ఆమె పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయాక కొన్నాళ్ళు ప్రొఫెసర్ దగ్గరే పనిచేసింది. ఆమె గురించి తెలిసిన వాళ్ళెవరూ పెళ్ళిచేసుకోవడానికి ముందుకు రాలేదు. పెళ్ళికావడం లేదని తల్లి దండ్రులు బాధపడుతుంటే ఆమెకు విసుగ్గా ఉండేది.

ఒక సారి ప్రొఫెసర్ ను ఇంటికి భోజనానికి పిల్చినపుడు ఆమె పెళ్ళి విషయం చెప్పి ఇద్దరూ బాధపడ్డారు.

" పనిలో నిశ్రద్ధ, అంకితభావం, గౌతమిలో అన్నీ మంచి విషయాలే చూశాను. డాక్టర్ గా, వ్యక్తిగా ఆ అమ్మాయి నాకెంతో ఇష్టం. మా అన్నయ్యకు విదేశాల్లో హాస్పిటల్స్ స్వంత ప్రాక్టీస్, హాస్పిటల్స్ ఉన్నాయి. మంచి డాక్టర్ కోసం చూస్తున్నాడు. గౌతమిని అక్కడికి పంపించుదామనుకుంటున్నాను. ఆమెను పొందే అర్హత ఉన్నవాడే వస్తాడు. కంగారు పడకండి."

అని ఆయన సర్ది చెప్పాడు.

ఓ నాలుగునెలల తర్వాత, ఆమె విదేశాల్లో ఒక యూనివర్సిటీ హాస్పిటల్ లో ఉద్యోగం లో చేరింది.

చీఫ్ ను కలిస్తే ఫార్మాలిటీస్ పూర్తి చేసిన తర్వాత సీనియర్ ను కలవమనీ, ఆమె ఉద్యోగంలో అలవాటుకావడానికి, మొదటి నెల అతనితో కలిసి పనిచెయ్యాలని చెప్పి పంపించాడు.

సీనియర్ రూం కు వెళ్తే సెక్రెటరీ మాత్రం ఉంది. 'సీనియర్ రౌండ్స్ కు వెళ్ళాడనీ, ఓ పదినిముషాల తర్వాత వస్తాడనీ' చెప్పి లోపల ఆయన ఆఫీసులో కూర్చోబెట్టింది.

ఒక పక్కగా ఉన్న సోఫాలో కూర్చుంది. పక్కనే ఉన్న అద్దాల కప్ బోర్డ్ లో అవార్డులు, షీల్డ్స్ ఉన్నాయి. కాన్ఫరెన్స్ లలో అతను దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి. అతన్ని చూస్తే ఎక్కడో పరిచయమున్న వ్యక్తిలా అనిపించాడు.

వెంటనే టేబిల్ మీద ఉన్న నేం ప్లేట్ చూసింది. పేరు చదవగానే ఆమెకు, పాత విషయాలు కొన్ని గుర్తొచ్చి గుండె వేగంగా కొట్టుకుంది.

ఇంతలో తలుపు తెరుచుకుని డా. రామచంద్ర లోపలికి వచ్చాడు.

ఒక క్షణం ఇద్దరూ ఒకరి నొకరు చూసుకున్నారు. ఆమెకు పాత జ్ఞాపకాలు చేదుగా గుర్తొచ్చాయి.

'హలో బాగున్నారా, చాన్నాళ్ళకు!' అంటూ పలకరించుకున్నారు.

ఎప్పుడో చాలా సంవత్సరాల క్రితం, లేతగా ఉన్నపుడు చూసిన రామచంద్ర గుర్తొచ్చాడు. పాలిపోయిన మొహంతో, అదురుతున్న పెదాలతో పరుగుపరుగున వెళ్ళిపోయిన ఒక యువకుడు గుర్తొచ్చాడు. ఆ అబ్బాయికీ ఇప్పుడు ఎదురుగా నుంచున్న డా. రామచంద్రకూ పోలికే లేదు.

అతని కళ్ళలో ఆత్మవిశ్వాసం, మొహంలో చిరునవ్వు చాలా స్నేహంగా పలకరించాడు.

"మీరొస్తున్నారని తెలుసు. అసలు ఎయిర్ పోర్ట్ కు వద్దామనుకున్నాను. కుదరలేదు." అని చెప్పి క్షమాపణ అడిగాడు.

ఆమె ఎక్కడ దిగిందో తెలుసుకున్నాడు. సౌకర్యంగా ఉందో లేదో వివరాలు కనుక్కున్నాడు.

తను అతనికి చేసిన అవమానం గుర్తొచ్చి, ఆమె ముడుచుకుపోతుంటే, అతనికవేం గుర్తులేనట్టు అతను స్నేహంగా మాట్లాడుతున్నాడు.

' ఇతని దగ్గర పనిచెయ్యాలా' అనుకుంటే, ఎక్కడలేని నీరసం కమ్ముకుంది.

ఆమె ఎంత కప్పిపుచ్చుకోవాలన్నా ఆమె ముఖంలో విసుగు, అసంతృప్తి కనిపిస్తూనే ఉన్నాయి.

ఎలాగైనా సరే నెలతిరిగే లోపల, వేరే ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోవాలి అనుకుంది.

*ముగింపు వచ్చే నెలలో ..*

Post your comments